

కోర్టుహాలు కిటకిట లాడిపోతోంది. సినిమా చూడబోతున్నంత ఉత్సాహంతో జరగబోయే తతంగానికి ఎదురుచూస్తున్నారు.

పోలీసులు – వెంటబెట్టుకొచ్చిన ముద్దాయిని బోనులోకి ఎక్కించి రెండు ప్రక్కలా నిలబడ్డారు. అందరిదృష్టి అతనివైపుకి మళ్ళింది.

కాని ఆనందరావుగారికి మాత్రం ఈ తతంగం అంతా చాలా చిరాగ్గా వుంది. అసలాయనకి కోర్టుకి హాజరవడమంటేనే పెద్ద తలనొప్పి. జీవితంలో ఆయన ఇంతవరకు కోర్టు కెక్కలేదు – జ్యూరీ మెంబరుగాతప్ప. "కోర్టు కెక్కినవాడు, గాడిదనెక్కినవాడుఒకటే" నన్న నమ్మకం ఆయనకి వంశపారంపర్యంగా వచ్చినది.

అసలు ఊళ్ళో పెద్దమనిషి అయుండడం కూడా పెద్ద బాధగానే ఉంది. 'తమరిని ఫలానా తారీఖుల్లో జ్యూరీ మెంబరుగా ఉండగోరుతున్నాము' అని ఫర్మానాలు జారీ చేస్తారు. మొదట తెలియక రానన్నాడు. కాని తరువాత జస్టిస్ రాజశేఖరం చెప్పాడు "మేం పిలిస్తే రాననకూడదు బ్రదర్! దేముడి కార్యంలాంటిది జ్యూరీ సభ్యత్వం. అయినా మిస్టర్ ఆనందరావు, ఏదో కొద్దిరోజుల జ్యూరీమెంబరుగా ఉండి వాళ్ళగోల వినవయ్యా అంటేనే మీ కింత బాధగాఉందే, మరి రోజూ పడే వాళ్ళం మే మేంకావాలి? ఒక్కకేసు

పూర్తయేసరికి తలలో పది వెంట్రుకలు నెరిసిపోతాయి" అని.

అడపా తడపా తనికీ స్వచ్ఛంద సేవ తప్పడంలేదు. అంతా విని "ముద్దాయి దోషి" అని నమ్మకం కలిగినా ఆమాట చెప్పటానికి జాలి వగయిరా అడ్డు వస్తుంటాయి.

తనీ తోటిజూరర్లవంక చూశారు ఆనందరావుగారు. అందరూ కబుర్లలో పడి చాలా బిజీగా కనబడుతున్నారు. అందరూ ఆయనకి పరిచయస్తులూ, మంచి స్నేహితులూను.

"ఇదంతా మన ఖర్మ" అన్నాడు డాక్టర్ సదానంద—ఆనందరావు తనవంక చూడంగానే నవ్వుతూ;

సదానంద ప్రొఫెసర్.

ఆయనకూడా నవ్వేశారు. అంతలోనే జడ్జీగారు రావడంతో అందరూ మళ్ళీ స్థానాల్లో కూర్చోవడం జరిగాయి.

గడియారంతోబాటు ముద్దాయి నేరం కూడా గబగబ ముందుకు సాగుతోంది. ముద్దాయి వైపుప్లీడరు బొత్తిగా పేరులేనివాడవడంవలన గవర్నమెంటు లాయరు గారు చకచక సాక్షుల్ని పిలిచి కోర్టుని ఏలేస్తున్నారు!

ఆనందరావుగారికి కేసు నడుస్తున్న కొద్దీ అందులో కుతూహలం కూడా పుట్టి జాగ్రత్తగా వినసాగారు. ఉభయుల వాదనలు వింటూ ఆయన గ్రహించినది -

ఆ కుర్రాడు — అంటే ముద్దాయి — కాలేజీలో చదువుకుంటున్నాడు. అతనితో పాటు సావిత్రి అనే అమ్మాయికూడా చదువుకుంటోంది. ఆ అమ్మాయితో ఇతని పరిచయం స్నేహంగా మారి ప్రేమగా స్థిరపడింది. ఆ అమ్మాయి కూడా అతన్ని ప్రేమించింది. ఫలితంగా ఇద్దరూ వివాహం చేసుకుందా మనుకున్నారు. ముద్దాయి గోపాలరావుకి ఆస్తి లేకపోయినా మంచి తెలివితేట లున్నాయి. అందముంది. వాటినే అడ్డం వేసుకుని సావిత్రి ఇంటికివెళ్ళి ఆ అమ్మాయి తాతగారితో తమ విషయం చెప్పాడు. అంగీకరించి ఆశీర్వదించ మన్నాడు.

కాని ఆయనగారు వీళ్ళ నిర్ణయాన్ని హర్షించలేదు. అందుకు ఒక కారణం ఆయన్న ధనవంతు డవడం. మరొకటి — ఆయన గోపాలరావుని తండ్రి పేరేమి టన్నాడు. ఇతను ఆ మాటకి సమాధానం చెప్పలేకపోయాడు. ఆయనగారు అదే ఒక అవకాశంగా తీసుకుని తండ్రి ఎవరో తెలియని అనామకుడికి తన కూతుర్ని ఇవ్వలే నన్నాడు. పైగా "నీతల్లిగురించి కూడా కొంత విచారించాను. అటువంటి చరిత్రగల ఇంటిలో నా మనుమరాలిని అప్పజెప్పలేను" అన్నారు.

గోపాలరావుకి సహజంగానే కోపం వచ్చింది. తన కోర్కెని కాదన్నా భరించ గలనుగాని తల్లిని అంటే మాత్రం సహించేదిలే దని హెచ్చరించాడు.

కాని ఆయన అతనిమాట లక్ష్యపెట్ట కుండా ఇష్టంవచ్చినట్టు మాట్లాడేశాడు. "నీ తల్లి, ఆవిడ తల్లికూడా నీతితప్పిన వాళ్లే" నన్నాడు. చివరికి "నువ్వు కేవలం నా ఆస్తినిచూసి మా అమ్మాయిని వలలో వేసుకున్నావు'' అన్నాడు.

దాంతో గోపాళ్లరావుకి కోపం హద్దు మీరిపోయి ఆయన్ని పట్టుకు కొట్టేశాడు. సావిత్రి అడ్డంపడి విడతీసింది. అసలే పెద్దతనం, జబ్బు మనిషి అందులో దెబ్బలు కొంచెం గట్టిగా తగలడంతో ఆయన మంచంపట్టి నెల్లాళ్ళకి స్వర్గస్తుడయాడు.

ఇతని మీద నేరం మోపబడింది.

అంతా వింటూ ఆనందరావుగారు అతని వంక చూశారు. చాలా అందంగా బలంగా ఉన్నాడు. ముఖంలో ఈ లోకం అంటే ఉన్న తృణీకారభావం మాత్రం కొట్టవచ్చినట్లు కనబడుతోంది. ఎవ్వరి వంకా చూడకుండా కూర్చున్నాడు.

గవర్నమెంటు లాయరు - కేవలం డబ్బు దృష్టితోనే అతను ఆ అమ్మాయిని ప్రేమించినట్లు, ఎప్పుడయితే తన ప్లానుకి అంతరాయం కలిగిందో అప్పుడు కోపం పట్టలేక ఆయన్ని కొట్టేసినట్లు ఋజువు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు.

ముద్దాయి తరుపు లాయరు - తల్లిని నానా మాటలు అని అతన్ని డబ్బుకోసమే తన మనవరాలిని ప్రేమించాడని అనడంతో ఆత్మాభిమానం కలవాడు కాబట్టి అలా కొట్టాడని, పూర్తిగా అతన్ని ఆ స్తితికి రెచ్చగొట్టింది ఆయనే కనుక అతని తప్పు లేదని చూపించేందుకు ప్రయత్నిస్తున్నాడు.

వాదనలు కేసు వివరాల్లోకి పోవడంతో ఆనందరావుగారికి విసుగు పుట్టి ప్రేక్షకులవైపు దృష్టి మరిల్చి ఆశ్చర్యపోయారు. నిజమా భ్రాంతా అని మళ్ళీ ఒకసారి పరిశీలనగా చూశారు :

"సందేహం లేదు సుభద్రే !" అనుకున్నారు సాలోచనగా......

*　　*　　*

గదిలో అటూ ఇటూ తిరుగుతున్నారు ఆనందరావుగారు. తోచక గాదు - ఆలోచనలు ఎక్కువయి. ఆయన మనస్సులో తన గత జీవితం కదలసాగింది.

—సుభద్రకి తను అన్యాయం చేశాడు. అంతక్రితం తను చేయగలనని కలలో నయినా అనుకోనంతగా ద్రోహం చేశాడామెకి. అంతకన్నా విచిత్రం ఏమిటంటే ఆమెని పూర్తిగా మరిచిపోయేందుకు ప్రయత్నించాడు.

సుభద్ర, ఆ అమ్మాయి తల్లి మాత్రం ఉండేవాళ్ళు ఇంట్లో. వాళ్ళ కున్న ఆస్తి ఆ ఇల్లు ఒక్కటే. అందులోనే రెండు గదులు అద్దెకిచ్చి దానిమీది ఆదాయంతో బ్రతుకుతుండేవారు. దీనికి తోడుగా ఆవిడ ఎవరో ప్లీడరుగారింట్లో వంటచేసి మరికొంత సంపాయిస్తుండేది.

తను వాళ్ళ ఇంట్లో ఒక గదిలో అద్దె కున్నాడు చదువుకునే రోజుల్లో. సుభద్ర తల్లిని గురించి తను కొన్ని మాటలు వింటుండేవాడు. మొదట వాటిని గురించి పెద్దగా పట్టించుకొనేవాడు కాదు. కాని తరువా త్తరువాత కొంత కుతూహలం కలిగి ఆమెను జాగ్రత్తగా పరిశీలించాడు.

మనిషి లోగడ అందంగా ఉన్న ఛాయలు ఇంకా పోలేదు. కాని వేలెత్తి చూపదగ్గ లోపం ఏనాడూ కనబడలేదు ఆమె ప్రవర్తనలో తనకి. చాలా మర్యాదగా మాట్లాడేది. బహుశ గతంలో కాలు జారిన మనిషేమోనని నవ్వుకునేవాడు.

సుభద్ర రూపంలో అంతా తల్లి పోలికే! చాలా అందమయినది. స్కూలు ఫైనలు చదువుతుండేది. ఎంతగా లేక పోయినా కూతురికి మాత్రం సాధ్యమయినంతవరకు ఏ లోపం రానిచ్చేదికాదు ఆవిడ. సుభద్ర ఎప్పుడూ మంచిబట్టలే కట్టుకునేది. బహుశ అదే వాళ్ళ అమ్మని గురించి ఊహాగానాలకి తావిచ్చి ఉంటుందనుకునేవాడు తను. నిజమే మరి, అంత ఖరీదయిన బట్టలు కొనేందుకు డబ్బు ఎలా వచ్చిందని ఎవరికయినా సందేహం కలగవచ్చుగా!

ఆ వయస్సుకి సహజమయిన చాపల్యంకొద్దీ సాధ్యమయినన్ని సారులు సుభద్రని చూసేందుకు ప్రయత్నించేవాడు కాని సాధారణంగా బయట కనబడేది కాదు. స్కూలుకి పోవడం, తిరిగి రావడం—తల్లి ఇంట్లో ఉండదు కాబట్టి తరువాత వంట ప్రయత్నంలో మునిగి పోవడం ఆమె కార్యక్రమం. ఏ బావి దగ్గిరనో దర్శన మిచ్చేది. తను చూడగానే సిగ్గుపడి తల వంచుకుని పారి పోయేది.

మనకు దగ్గరకాని వస్తువుమీద కుతూహలం, ఆకర్షణా పెరగడం సహజం. అలాగే తనకి కూడా సుభద్రమీదికి ఆలోచనలు మాటి మాటికీ పోతుండేవి. అరికట్టుకుందా మని వ్యర్థ ప్రయత్నం చేసేవాడు.

"తనే పెద్ద పతివ్రతయినట్టు, ఇవతల వారంతా రౌడీలయినట్టు – అలా పారి పోతుందేం" అనిపించేది ఒకొక్కసారి వళ్ళు మండి.

మొదటి ఏడా దంతా ఈ విధంగానే గడిచిపోయింది. వేసవి శలవలకి ఇంటికి బయలుదేరుతుంటే ఏదో పెన్నిధిని వదలిపోతున్నట్లుగా బాధపడ్డాడు. అప్పుడే తన మనస్సుకి హత్తుకుపోయిన సంఘటన ఒకటి జరిగింది. ఇక మర్నాడు వెళ్ళి పోతా డనగా పంపుదగ్గర స్నానం చేసి గదిలోకి వెళ్ళబోతుంటే సుభద్ర ఎదురయింది—బియ్యం గిన్నెలో పోసుకుని.

ఆదే అదు నని "పరీక్షలు బాగా వ్రాశావా?" అనేశాడు తాను.

తల వంచుకుని "ఊఁ" అంది.

ఇక అంతకన్న ఏం మాట్లాడాలో

"ఒరే బాబూ దూరంగా ఉండు, మీనాన్నగారిని పలకరించకు, గొప్ప డిటెక్టివ్ కథ రాయబోతున్నారు."

తెలియక తాను కదులుతుంటే "రేపు వెళ్ళిపోతారుటగా" అంది మెల్లిగా.

ఆమాటలో ఏదో స్ఫురించి "అవును" అన్నాడు తాను వెనక్కి తిరిగి.

"పై ఏడాది మా రూములో నే ఉంటారా ?... హాస్టలుకి పోతారు కాబోలు."

"నువ్వు మాట్లాడుతూ ఉంటానంటే ఇక్కడికే వస్తాను" అన్నాడు తాను ధైర్యం చేసి.

ఒక్కసారి నవ్వి తలవెనక్కి విసిరి పంపుదగ్గరకు వెళ్ళిపోయింది సుభద్ర. అప్పటి ఆమె అందాన్ని నెమరవేసుకుంటూ గదిలోకి పోయాడు తాను.

తరువాత శలవు లిచ్చేసినందుకు బాధపడిపోయాడు.

ఆ మరుసటి ఏడాది హాస్టల్లో సీటు వచ్చినా వదిలేశాడు. "బయట గదిలో ఉంటే చదువు బాగా సాగుతుంది నాన్నగారూ, హాస్టల్లో గోల ఎక్కువ. చదువుకునేవాళ్ళని ఏడిపిస్తారు" అని సాకు చెప్పి మళ్ళీ పాతగదికే చేరుకున్నాడు. ఈ సారి తన అదృష్టంకూడా బావుంది !

సుభద్ర స్కూల్ ఫైనలు పాసయి కాలేజీలో చేరతానని పట్టుపట్టింది. వాళ్ళమ్మ ఎన్ని విధాల నచ్చచెప్పినా వినలేదు అమ్మాయి. తాను అంతక్రితం ఏడు ఉండి మంచివాడనిపించుకున్నందువలన నేరుగా ఆవిడ తన దగ్గరకే వచ్చి "చూడు నాయనా మా పిల్లది, కాలేజీలో చదువుతుందిట. పిల్లకాకి కేం తెలుసు నసీనా బాధ ? మీలాంటి ఉన్న మహారాజులకయితే ఫరవాలేదు కాని, ఆడముండని నే నేం పోయగలను అంతేసి డబ్బు !'' అంది.

వెనక తలుపుచాటున నిలబడే ఉంది సుభద్ర పమిట చెరుగుని వేళ్ళమధ్యన ఇస్త్రీ పెడుతూ.

"స్కాలర్ షిప్‌లు ఇస్తారటగా" అంది జనాంతికంగా.

"అవును – కాని మార్కులు చాలా బాగా ఉంటే తేలిగ్గా వస్తుంది."

"నాకు మార్కులు బాగా వచ్చాయి!"

"తీసుకురావే అబ్బాయి చూస్తాడు" అంది ఆవిడ.

ఛంగున పరుగెత్తి కెళ్ళి పుస్తకం పట్టుకొచ్చింది. ఆ అమ్మాయి చేతులోంచి తనే తీసుకుని చూశాడు. ఆశ్చర్య పోయాడు – బ్రహ్మాండంగా ఉన్నాయి మార్కులు.

"సుభద్ర కివ్వకపోతే ఇం కెవరి కిస్తారండి ?" అన్నాడు ఉత్సాహంగా.

ఫలితంగా కాలేజీలో చేరింది సుభద్ర. అప్పటినుంచే తన మీద ఒక మధుర మయిన భారం వేయబడింది.

"దానికి వేరే ప్రయివేట్లు చెప్పించే తాహతు లేదు నాయనా నాకు – ఏదో నువ్వు నామీద దయవుంచి దానికి నాలుగు ముక్కలు చెబితివంటే చచ్చి నీ కడుపున పుడతాను" అంది ముసలావిడ.

అంతకన్న తనకిమాత్రం కావలసిం దేముంది. మనస్సు ఆనందంతో ఎగిరి గంతేసింది ... మొదట సిగ్గు పడుతుం డేది సుభద్ర. కాని రానురాను చనువుగా ఉండసాగింది. కేవలం పాఠాలు మాత్రం అడిగేదల్లా క్రమంగా ఇతర విషయాలు మాట్లాడసాగింది.

తరువాత తమ ఇమిద్దరిమధ్యా కేవలం ఇతర విషయాలే వచ్చేవి. తనను పూర్తిగా నమ్మి తన సర్వస్వం అర్పించు కుంది.

తన మనస్సు మాత్రం తన కప్పటికి పూర్తిగా తెలియదు. ఆ అమ్మాయిని ప్రేమించి ఆమె స్నేహాన్ని కోరా డను కోవడం పొరపాటే అవుతుంది. ఆమె అందం తన్ని ముగ్ధుడ్ని చేసింది. అందు కోసమే తను ప్రయత్నించాడు. వయస్సులో ఉన్న అందమయిన అమ్మాయిలపట్ల సహజంగా ఉండే ఆకర్షణవలన మాత్రమే తను ఆమె సహచర్యాన్ని, సాన్నిహిత్యాన్ని అభిల షించాడు. అనుకోకుండానే తనకి ఆమె లభ్యమైయింది. అందుకు తన్ను తాను అభినందించుకున్నాడు – అదృష్టవంతుడ నని.

తన కోర్కె ఫలించేందు కని తను ఆమెతో కొన్ని మాటలు అని ఉండ వచ్చును – కాని అది కేవలం అబద్ధమేనని తెలిసి చెప్పాడు అప్పట్లో. పాపం సుభద్ర నమ్మింది.

తనకి పరీక్షలు జరిగేవరకూ ఎవరికీ తనమీద అనుమానం రాలేదు. అలా జాగ్రత్త పడ్డాడు తాను. కొద్దిమంది స్నేహితులు పసిగట్టి ఈర్ష్యపడ్డారు...చివ రికి తను చదువు పూర్తిచేసుకుని ఇంటికి

బయలుదేరవలసిన రోజు ఆసన్నమయింది.

శలవ లిచ్చేశారని తెలిసిన సుభద్ర అడిగింది "మరి నా సంగతి ఏం చేస్తారు?" అని.

నిజానికి అప్పటిదాకా తను ఆ విషయమే అంతగా ఆలోచించలేదు. అందువలననే హటాత్తుగా ఆ ప్రశ్న ఎదురవడంతో కలవరపడిపోయి "ఏముంది, ఇంటికి వెళ్ళి మా వాళ్ళతో చెప్పి ఏర్పాటు చేయిస్తాను" అనేశాడు.

సుభద్రకి తనమీద, తనప్రవర్తనమీద అపారమయిన విశ్వాసం—"నాకు తెలుసు, మీరు నన్ను అన్యాయం చేయరని..ఇప్పుడునేను వట్టిదాన్నికూడా కాను. మన స్నేహం ఫలించింది'' అంది సిగ్గుపడుతూ మెల్లిగా.

ఇంకో పరిస్థితుల్లో నయితే ఈ మాటకి ఎంతో ఆనందపడవలసినది. కాని అప్పుడు మొదటిసారిగా పశ్చాత్తాప్పడ్డాడు—తన తొందరపాటుకి. ఆ అమ్మాయి భవిష్యత్తుని పాడుచేశానని బాధపడ్డాడు.

రైల్లో కూర్చున్నా సుభద్ర తన మనస్సులోంచి పోలేదు. తనకు తెలియకుండానే తనలో ఒక చెరగని ముద్ర వేసుకుంది. "పోనీ సుభద్రనే చేసుకుంటే ఏం—అందమయినది, చదువుతున్నది.

అన్నిటికీ మించి చాలా మంచిది.'' అన్న ఆలోచన కలిగింది. కాని ఆ వెంటనే చండశాసనుడయిన నాన్నగారు, అక్కయ్యకూతురు పద్మావతి, వంశ గౌరవం వగయిరా జ్ఞాపకం వచ్చాయి.

''సుభద్ర తల్లి గతచరిత్రని గురించి ఎవరూ మంచిగా చెప్పుకోరు. ఆమె ప్రస్తుతం వంటలు చేస్తోంది. తన తండ్రి ఇటువంటివాళ్ళతో సంబంధానికి ఇష్టపడతాడా ?''

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది.

అక్కడికీ ధైర్యంచేసి అమ్మతో చెప్పాడు తను – ఇలా సుభద్ర అనే అమ్మాయిని చేసుకోవా లని ఉన్నదని. కాని అసలు జరిగిన విషయం మాత్రం చెప్పలేదు. అయినా ఆ చెప్పినంతవరకే కొంప లంటుకున్నాయి. నాన్నగారు శివ తాండవం చేశారు. అమ్మ ఏడుస్తూ "అక్కయ్యకూతుర్ని చేసుకుంటా వని అందరం ఆశపెట్టుకున్నాం నీమీద. అలా చేస్తే అక్కయ్య ఆత్మకి శాంతి కలుగుతుంది. పద్మకూడా నిన్నుతప్ప ఇంకెవ రినీ చేసుకో నంటోంది. ఇప్పుడు దాని గతేం కావాలి ?" అంది.

"మావయ్యా, నువ్వు నాకింత అన్యాయం చేస్తావని కలలోకూడా అనుకోలేదు...పోనీలే, నువ్వయినా సుఖపడు'' అంటూ నున్నని బుగ్గల మీదుగా కన్నీళ్ళు కార్చింది పద్మావతి.

వీళ్ళందరిమధ్యా తను ఓడిపోయాడు. దీనంతకీ ముఖ్యమయిన కారణం – తనకి కూడా తన నిర్ణయాన్ని గురించి అంతగా పట్టుదల లేకపోవడం కావచ్చును.

మొత్తానికి పద్మావతితో తనకి పెండ్లి అయిపోయింది. కొన్నాళ్ళలో సుభద్రని పూర్తిగా మర్చిపోవచ్చు ననుకున్నాడు – కాని తను అక్కడే పొరపడ్డాడు !

'ఈర్ష్య' అన్నది ఆడదాని సొత్తు అన్నమాటని పద్మావతి నిజం చేసింది. తను ఇంకా మనస్సులో సుభద్ర నే ఆరాధిస్తున్నట్లు అనుమానపడసాగింది. చీటికీ మాటికీ సుభద్రవిషయం తెచ్చేది. తనేమయినా కొద్దిగా విసుక్కుంటే "మీ సుభద్ర అయిఉంటే మిమ్మల్ని విసిగించేదికాదు కదూ'' అనేది. ''నేను మిమ్మల్ని అన్యాయం చేశాను. సుభద్ర అయుంటే మిమ్మల్ని ఇంతకన్న సుఖ పెట్టేది'' అటుండేది.

ఇలా ప్రతి మాటకి సుభద్ర పేరు తెచ్చి ఆమెని తనతో పోల్చుకొనడంతో అనుకోకుండానే తనకి తనే ఎంతో చెరుపు చేసుకుంది పద్మావతి. ఆమె ఆ మాటలు అనగా అనగా తనకి కూడా అనిపించ సాగింది ''సుభద్రని చేజేతులా ఒదులు కుని జీవితంలో నష్టపోయానా ?" అని. అయినా ఆ ఆలోచనని సాధ్యమయినంత వరకు దూరంగానే ఉంచుదా మని ప్రయ త్నించేవాడు. కాని పరోక్షంగా పద్మావతే

తనని బలహీనుడ్ని చేసింది ఆ విషయంలో.

తను అనేవాడు కూడా – "అనవసరంగా నువ్వు అనుమాన పడుతున్నావు పద్మావతీ. నా మనస్సు ఇంకా ఆ అమ్మాయి మీదే ఉండినట్లయితే నిన్నెందుకు చేసుకుంటాను ? ప్రతి మగవాడు బ్రహ్మచారి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు పెడదారి పడతాడు. దాన్ని దిద్దుకునేందుకు మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తున్న నాతో సహకరించు. అంతేగాని ప్రతిసారి ఆ అమ్మాయి పేరు తేవడం వలన ఇద్దరికీ ఉపకారం జరగదు" అని.

వెక్కి–వెక్కి ఏడ్చేసేది !

అదే ఆమె మనస్సులో ఒక దిగులుగా ఏర్పడిపోయి ఆమె ఆరోగ్యాన్ని హరించేసి మంచం పట్టించింది. తన శక్తి వంచన లేకుండా పద్మావతిని నమ్మించేందుకు ప్రయత్నించాడు. కాని తన ప్రతి కదలిక పట్ల అనుమానపడేదాన్ని తృప్తి పరచడం తన తరం కాకపోయింది.

అసలే అర్భకం మనిషి. చిన్నతనంలోనే తల్లిపోవడం వలన అతిగారాబంగా పెరిగినది కావడాన మంకుతనం కూడా అబ్బింది. అందుకే తన కున్న అనుమానం పునర్విమర్శించుకోకుండానే తన నిండు జీవితాన్ని పాడు చేసుకుంది చివరకి.

"ఇన్నాళ్ళు మిమ్మల్ని అనవసరంగా అనుమానించానని తెలుసు నాకు. కాని నాలోని బలహీనతలే నన్ను పాడు చేశాయి. నన్ను క్షమించండి. ఏనాటి కయినా సుభద్ర మళ్ళీ మీకు తటస్థపడితే ఆమెని స్వీకరించండి. ఇదే నా కోరిక" అంటూ తన జీవితంలోంచి నిష్క్రమించింది.

జాలిగా రెండు కన్నీటి బొట్లు రాల్చాడు.

అయిదు సంవత్సరాల తమ దాంపత్య జీవితంలో ఇద్దరూ సుఖపడింది లేదు. లేనిపోని అనుమానాలతో పద్మావతి బాధపడుతుండేది. తాను ఆమెని ఎలా సమాధాన పరచాలో తెలియక సతమతమవుతుండేవాడు.

ఆమె పోయి అప్పుడే పదిహేను సంవత్సరాలయింది. ఈ మధ్య కాలంలో చాలామంది తన్ని మళ్ళీ గృహస్థుగా మార్చే ప్రయత్నం చేసి విఫలులయారు. తన తల్లికూడా "నీ ఇష్టం వచ్చినదాన్ని చేసుకోరా పోనీ – ఆడపిల్ల ఇంట్లో తిరగనిదే సిరికూడా ఉండదు" అనేది. తాను మాత్రం నవ్వి ఊరుకునేవాడు. ఇప్పుడు అలా చెప్పేందుకు ఆవిడకూడా లేదు. తాను ఏకాకి !

తన మనస్సులో మాత్రం ఎప్పుడూ సుభద్ర,పద్మావతి మెదులుతూ ఉంటారు. పద్మావతి ఉండగా తనలో కలిగించిన అభిప్రాయం ఇప్పుడు బాగా బలబడిపోయింది. అది – "సుభద్రని చేసుకుని ఉంటే నిజంగా సుఖపడి ఉండేవాడిని" అన్నది.

ఇన్ని ఏళ్ళుగా ఒక్కమాటైనా విన లేదు ఆమెని గురించి. నిజానికి పద్మావతి ఉన్న రోజుల్లో సుభద్రని గురించి తెలుసుకో దలుచుకో లేదు కూడా. కాని ఆమెపోయాక సుభద్రకోసం విచారించాడు. ఆమె ఉనికిని తెలుసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది. ఆమెను గురించి తాను తెలుసుకోగలిగినదల్లా — సుభద్ర హటాత్తుగా ఇంట్లోంచి అదృశ్యమయిందని. తరువాత కొన్నాళ్ళకి ఆమె తల్లికూడా ఇల్లు అమ్మేసి వెళ్ళిపోయిందని. మరి వారిద్దరూ కలుసుకున్నారో లేదో తెలియలేదు.

ఆ సుభద్ర ఈనాడు తనకి హటాత్తుగా కనిపించి మళ్ళీ మాయమయింది. కోర్టు హాల్లో అగపడిన మనిషి ఎప్పుడు వెళ్ళిపోయిందో, తరువాత తాను చూస్తే లేదు.

సుభద్రకోసం తనెందుకు వెతికాడు అంటే....

తలుపు చప్పుడయింది. మొదట గాలేమోననిఅనుకున్నాడు. కాని భద్రయ్య వచ్చి "అయ్యగారూ, తమరి కోసం ఏవరో వచ్చినారండి. హాల్లో కూర్చుండ బెట్టినా" అన్నాడు.

గభాలున నైట్‌గౌను వేసుకుని హాల్లోకి వెళ్ళాడు.

ఆమె లేచి నుంచుని నమస్కరించింది.

"సుభద్రా!'' అన్నాడు. ఆశ్చర్యంగా.

ఆమె చిన్నగా నవ్వుతూ "అవును నేనే. ఇంకా మీకు గుర్తుండడం నా అదృష్టం'' అంది మెల్లిగా.

"కాని సుభద్రా, ఆశ్చర్యపోవడం పొద్దున్నే అయిపోయింది. అసలు నువ్వు కాదేమోనన్న అనుమానం కూడా కలిగింది" అని కాసేపు తటపటాయించి "ఎక్కడ ఉంటున్నావు ?'' అనడిగాడు.

"షుమారు ఇరవయి ఏళ్ళ తరువాత ఇప్పుడు మళ్ళీ మీ ఎదట ఉన్నాను చాలదా ?" అంది దిగులుగా నవ్వుతూ.

ఆనందరావుగారు తలవంచేసుకున్నాడు. "నేను క్షమించరాని అపరాధం చేశాను సుభద్రా నీ పట్ల. నీ జీవితం ఏమయిపోతుందోనన్న ఆలోచనయినా లేకుండా నా దారి నేను చూసుకున్నాను. పిరికివాడిని. స్వార్థపరుడ్ని!"

"సర్లెండి, అయిపోయిన దానికి ఇప్పుడు మనం విచారపడడం దేనికి ? ఒక ఆడది పాడైపోయిందంటే ఆ పాపంలో మగవాడికి ఎంతభాగం ఉందో ఆడదానికీ అంతా ఉంటుంది. ఒక్కర్ని విడిగా నిందించకూడదు ... అప్పుడు తప్పు చేసినది కేవలం మీ రొక్కరే కాదు—నేనుకూడా ! కాకపోతే మగవాడు అదృష్టవంతుడు. ఆడది మాత్రం ఆ తప్పుయొక్క గుర్తుల్ని శాశ్వతంగా భరించాలసి ఉంటుంది. అందుకని ఆ సంగతి గ్రహించే ఆడదాన్ని అదుపాజల్లో పెట్టాలనడం మనవాళ్ళు...

మీకు నే నేదో పాఠాలు నేర్పుతున్నట్లు మాట్లాడుతున్నాను కదూ ?''

ఆనందరావుగారు ఆమె మాటలు వినిపించుకోలేదు. "నీకు మనస్సుకి కష్టం కలగకుండా ఉంటే ఒక్కమాట అడుగుతాను. నేను నిన్నలా అర్ధంతరంగా వదిలేసి వెళ్ళిపోయాక నన్ను తిట్టుకుని ఉంటావుకదూ ?''

"తిట్టుకున్నాను. కాని మిమ్మల్ని కాదు—నన్ను నేను. మిమ్మల్ని మనస్ఫూర్తిగా నమ్మడం నా తప్పు కాదూ మరి!...చాలా రోజులదాకా ఇంకా మీరు వస్తారనే ఆశతో ఎదురు చూశాను. కాని నిరాశే వరించింది నన్ను. రోజులు గడుస్తున్న కొద్దీ నా శరీరంలోని మార్పులు నాకే కొట్టవచ్చినట్లు కనబడ సాగాయి. అమ్మకూడా ఏదో అనుమాన పడుతున్నట్లు నావంక చూసేది. కాని బహుశ అడిగేందుకు ధైర్యం చాలేది కాదనుకుంటా. లేకపోతే తన జీవితంలో తాను చేసిన పొరబాటే కూతురు చేసిందని తెలిసికూడా ఆ అనుమానాన్ని ధృవ పరుచుకుని పరిస్థితిని ఎదుర్కొనేందుకు శక్తి చాలకనోఏమో మొత్తానికి మాట్లాడేది కాదు..దీనికితోడు మన విషయం తెలిసిన మీ స్నేహితులు కొందరు చేసే అల్లరి దుర్భర మయిపోయేది.

"నిజంచెప్పొద్దూ, మొదట ఆత్మహత్య వైపుకి లాగేది మనస్సు – ఏ ఆడదాని కయినా ఆ పరిస్థితుల్లో అంతిమ శరణ్యం



"మిద్దెమీది అమ్మాయి ఫ్రెండ్ వచ్చినట్టున్నాడు."

ఆదేగా ! కాని నా కడుపులో కదిలే జీవిని తలచుకుని ఆ ఆలోచనలని మనస్సులోంచి నెట్టేసేదాన్ని. చివరికి ఆ ప్రాణిని

రక్షించి భూమిమీద ఒక వ్యక్తిగా నిలిచేందుకు నిర్ణయించుకుని ఒకరాత్రి ఇంట్లోంచి పారిపోయాను.

"మీరు అమ్మని ప్రోత్సహించి నన్ను కాలేజీలో చేర్పించడం అప్పుడు అక్కరకు వచ్చింది. ఉద్యోగం తేలికగా సంపాయించుకో గలిగాను. నా గతం తెలియనివాళ్ళ మధ్య బ్రతకడం తేలికని పించింది. అక్కడ అందరితోనూ 'నాకు పెళ్ళి అయిందని, కాని భర్తకి చెడు తిరుగుళ్ళు అలవాటయి నన్ను వదిలేశా రని' చెప్పేశాను.

"తరువాత అమ్మ పాపం ఒంటరి దయి పోయిందని ఆమెకి ఉత్తరం రాశాను — కులాసాగా ఉన్నాను. మరేం ఫరవాలేదు. ఫలానా కారణంవలన ఇలా వదలి వచ్చేయవలసొచ్చిందనీ, క్షమించమనీ! ముఖతః చెప్పేందుకు లేని ధైర్యం ఉత్తరంద్వారా చెప్పేందుకు వచ్చింది.

"పాపం ఆవిడకూడా కూతురు బ్రతికి ఉంది అదే చాలుననుకుని అక్కడఉన్న ఇల్లు అమ్మేసి నాదగ్గరకు వచ్చేసింది. కాని ఆమెమనస్సులో ఉన్న దిగులు మాత్రం ముఖంలో కనబడేది. బహుశ కూతురు ఇలానాశనం అయిపోయిందని బాధపడుతుండేదనుకుంటా — 'అమ్మాయ్, పోనీ ఎవరినయినా పెళ్ళి చేసుకోరాదటే ఎలాగోలా అయిందని పిద్దాం' అనేది.

"కాని నాకే ఇష్టం లేకపోయింది. ఉన్ననిజాన్ని చెబితే మనలో ఎవరూ చేసుకునేందుకు సిద్ధపడరు. అథవా ఇష్టపడినా అది మనస్ఫూర్తిగా మాత్రం కాదు. ఇల్లు అమ్మగావచ్చిన డబ్బుచూసో లేక వయస్సులోఉన్న నన్నుచూసో!... కొన్నాళ్లు గడిపి చక్కాపోతారు. ఇక నిజాన్ని కప్పిపుచ్చి చేసుకోవడమంత మహాపరాధం మరొకటి ఉండదు. ఇది మన్ని మనమే మోసగించుకోవటం. ఏనాటికయినా నిజం బయటపడకపోదు.

కాబట్టి నేను అసలు వివాహప్రసక్తి రానిచ్చేదాన్నికాదు. జీవితంలో ఏదో ఒక్కసారి తప్పటడుగు వేశాను. చరిత్ర చర్విత చరణం కావడం నాకిష్టం లేదు" అని కాసేపాగి నవ్వుతూ "మీరు కట్టకపోయినా మీపేరుతో నేనే మంగళ సూత్రంకూడా కట్టేసుకున్నాను" అంది.

ఆనందరావుగారు ఏమీ మాట్లాడలేదు.

''సరే ఒక కొడుకు పుట్టాడు. అమ్మ మనవడ్ని చూసి మురిసిపోయింది. కాని ఆ ఆనందం ఆమెకి ఆట్టేకాలం దక్కలేదు.''

"అంటే?'' ఆతృతగా అడిగా రాయన

''మా అమ్మ పోయింది. జీవితంలో ఏకాకి నయాను. పైగా నామీద ఓ భారం. వీడిని చూస్తూ రోజూ ఆఫీసులో పడే సూటీపోటీ మాటలు, అండలేని ఆడదాని పట్ల మగవాళ్ళుచూపే తేలికభావం అన్నీ మర్చిపోయేదాన్ని. వాడే నా జీవిత

సర్వస్వం. కొద్దికాలం మాత్రమే అనుభవించిన మధురస్మృతుల చిహ్నం ! నేను ప్రేమించినవారి ప్రతిరూపం !

నాలోని శక్తి నంతా ఒడ్డి వీడిని పెద్దవాడిని చేయాలి. నలుగురిలో 'ప్రయోజకుడు' అనిపించుకోవాలి వాడు. అంతకన్న ముఖ్యం–వాడివల్ల ఎవరూ బాధపడకుండా ఉండేట్లు వాడిప్రవర్తన రూపొందించాలి ! అదే నా ధ్యేయం. అందుకే నా ప్రయత్నమంతా. వాడికి ఏకష్టమూ రానీయకూడదు. అదే నా తపస్సు.

కాని అందులోనూ కొంతలో కొంత అపజయం పొందా ననే ఒప్పుకోవాలి. వాడికోసం నేను సంపాయించి ఇచ్చే ధనంతోపాటు నా గత చరిత్ర కూడా నీడలా వాడిని అనుసరించింది.

ప్రతిచోటా వాడిని ఎదుర్కొన్న మొదటి ప్రశ్న "మీ నాన్నగారి పేరేమిటి ?" అన్నది. వాడిని కుర్రాళ్ళు ఏడిపించా లన్నా అదే ప్రశ్న. వాడు నన్ను అడిగేవాడు అదేమాట – ఏం మాట్లాడను ? ఏమని చెప్పను ?

చిన్నప్పుడు మా అమ్మని గురించి రకరకాలమాటలు నా చెవిన పడుతుండేవి. దుర్మార్గురాలిని వాటిని నమ్మేదాన్ని ! "ఏదో లేనిదే అందరూ ఎందుకిలా చెప్పుకుంటారు ?" అనిపించేది – అమ్మని అనుమానించేదాన్ని. అది స్వానుభవం లోకి వచ్చాక నేను చేసిన పొరపాటు తెలిసివచ్చింది.

కాని ఆ విషయంలో మాత్రం నేను అదృష్టవంతురాలిని. నా కొడుక్కి నా మీద నమ్మకం ఎక్కువ. ఎవరినోట ఏమాట విన్నా నన్ను అనుమానించేవాడు కాదు. వాడు వేసే ఒకేఒక ప్రశ్న "నాన్న ఎవరు ?" అని.

వాడు పెద్దవా డయి యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం వచ్చాక నా కథ అంతా చెప్పాను

"ఏమన్నాడు ?'' అడిగారు ఆనందరావుగారు.

సుభద్ర ఒక్కక్షణం ఆలోచనలో పడింది. ఏమన్నాడో ఎలా చెబుతుంది ?... 'తండ్రి – అనే గౌరవపదం చాటున దాక్కున్నప్పటికీ నేను ఆ వ్యక్తిని క్షమించను, క్షమించలేను. నా కిలా తండ్రి ఎవరో తెలియకుండా ఉండటమే కోరుకుంటాను గాని మానవత్వంలేని అటువంటి మనిషి ఎదట పడటానికి ఇష్టపడను. అదే జరిగితే నే నేమయిపోతానో, ఏం చేస్తానో నాకే తెలియదు. ఆయన ఒకవేళ మళ్ళీ నీ కంటపడినా నాకుమాత్రం చూపించకు.' అన్నాడు తీక్షణంగా అని చెబుతుందా ?...

బయటికి మాత్రం నవ్వేసి "ఏమంటాడు, మీ పేరుకూడ చెప్పమన్నాడు. అవకాశం వచ్చినప్పుడు చెబుతానులే అని సమాధానపరిచాను...స్కూల్లోనూ కాలేజీలోను మంచిమార్కులు రావడం

వలన ప్రతిక్లాసులోనూ స్కాలర్‌షిప్‌లు వచ్చేవి. అందుకనే వాడిని చదివించేందుకు ఎక్కువగా కష్టపడవలసిన పని లేకపోయింది. అందుకే అంత లక్షాధికారి కూతురయినా ఆ అమ్మాయి సావిత్రి వాడిని ప్రేమించింది !''

ఆశ్చర్యపోయారు ఆనందరావుగారు, "అయితే ఇందాక కోర్టులో...''

''అవును. కోర్టులో మీ అందరిఎదట ముద్దాయిగా నిలబడినవాడే నా కొడుకు – మనవాడు. నే నిపుడు వచ్చింది ఆ విషయం చెబుదా మనే !''

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. మళ్లా ఆవిడే అంది–

"వాడు, సావిత్రి ఒకరినొకరు ప్రేమించుకున్నారు. నేను అక్కడికీ అన్నాను–పెద్దవాళ్ళమీద మనం ఆశలు పెంచుకోకూడదురా–అని. కాని 'సావిత్రి అలాంటిది కాదమ్మా' అనేవాడు. ఆ అమ్మాయిని రెండు మూడు సార్లు మా ఇంటికి తీసుకునివచ్చాడు కూడా. చాలా అందమయిన పిల్ల. అణకువ కలది. వాళ్ళిద్దరినీ చూసి ముచ్చట పడ్డాను. కాని స్వానుభవం ఉండడం వలన కాబోలు వాళ్ళిద్దరి ప్రేమా ఫలిస్తుందనిపించేదికాదు.

సావిత్రి వీడిని వాళ్ళ ఇంటికి వచ్చి వాళ్ళ తాతగారిని అడుగమందిట పెళ్ళి విషయం–ఆ సంగతి నాకు తెలియదు. వీడు వెళ్ళి ఆయన్ని అడిగేసరికి కులాలు, గోత్రాలు వచ్చి నా ప్రసక్తి వచ్చిందిట. వాళ్ళ అమ్మాయి వీడితో తిరుగుతోందన్న విషయం ముందే తెలియడం వలన అంతక్రితమే వీడిని గురించి విచారించినట్లున్నాడు. సహజంగానే నా గురించి చెప్పదలచుకున్న వాళ్ళకి మంచి అవకాశం దొరికి దాన్ని వినియోగించుకున్నారు. ఉన్నవి, ఊహించినవి కలిపి చెప్పిఉంటారు.

"మీ అమ్మ అలాటిది – నీ కేమో తండ్రి ఎవరో తెలియదు. పోనీ ఆస్తి అక్కరలేదనుకున్నా నాకు వంశగౌరవం కావాలి. ఏం చూసి నీ కివ్వమంటావు ? నీ తల్లి పేరు, ఆవిడ తల్లి పేరు అన్నీ నాకు తెలిశాయి......"అంటూ వీడిని దులిపేశాడు. దాంతో వీడికి కోపం వచ్చి, ఆయన మీద కలియబడ్డాడు...విన్నదేగా ఇదంతా మీరు.

ఇప్పుడు నేను పుత్రభిక్ష కోసం వచ్చాను మీ దగ్గరకు. వాడివేపు మాట్లాడేందుకు మంచి లాయర్ని పెడదామన్నా నాకు తాహతు లేదు. మీరే దీనికి పూనుకోవాలి. నా కొడుకుని నాకు దక్కించండి. ఇందువలన మీ పరువు ప్రతిష్ఠలకి భంగం కలుగుతుం దని భయపడకండి. అటువంటి పను లేవీ నేను చేయను. మీ రెవరో ఎవ్వరికి చెప్పను. ఇప్పుడు రావడం కూడా ఎవ్వరూ చూడకుండానే వచ్చాను. నాకు వాడిని దూరం కానీయకండి'' అంది. అలా అంటూంటే ఆమె

కండ్లు, నీళ్ళతో నిండిపోయాయి. గొంతు పూడుకుపోయింది.

ఆనందరావుగారు ఇంకా ఆశ్చర్యం నుంచి కోలుకోలేదు సరిగా — "వాడు నా కొడుకా! నాకూ ఒక కొడుకున్నాడన్నమాట! ఒక భార్య ఉందన్నమాట! నేను ఒంటరివాడిని కాదన్నమాట!" అనుకుంటున్నాడు మనస్సులో.

అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చేసి "పిచ్చిదానా—నీ కెంత బాధ్యత ఉందో ఆమాత్రం నాకూ ఉంది. నువ్వు 'పుత్ర భిక్ష' అంటూ నన్ను యాచించటానికి వచ్చావు కాని నా దగ్గరనుంచి ఏం కావలసినా అడుగగలఅధికారం నీ కుంది. చెప్పాగా, నిన్ను అన్యాయం చేసినందుకు నేనూ ఏమీ సుఖపడలే దని!

"ఇంత ఆస్తి వున్నా నేను 'ఏకాకినే' అన్న భావం అనుక్షణం కలుగుతుంటుంది నాకు. కాని ఇక అదంతా గతం. ఇక ముందు...సరే, సరే అవన్నీ తరువాత ఆలోచిద్దాం. ముందు వీడిసంగతి చూడాలి. వీడికి వచ్చిన భయ మేమీ లేదు. మొదటి విషయం—కేసు మరేమంత పెద్దది కాదు. ఇక లాయర్లంటావు— పెద్దపెద్ద వాళ్ళంతా మన చేతుల్లోని వాళ్ళే. అదీ కాక... అదేమిటి ఛ ఛ కళ్ళు తుడుచుకో'' అని ఒక్క క్షణం తటపటాయించి తనే ఆమె పయటచెరుగుతో కళ్ళద్దారు.

''చూశావా-కాని ఒక్క షరతు. కేసు పూర్తయి వాడు విడుదలయ్యాక నేను ఫలానా అని వాడికి చెప్పాలి నువ్వు. వాడి నిర్ణయానికి తల ఒగ్గుతాను."

* * *

అసలు మొదటినుంచీ కూడా కేసు చాలా తేలికయిందన్న నమ్మకం ఉంది ఆనందరావుగారికి. దానికితోడు సావిత్రి-ముందు తన తాతగారే అతన్ని, అతని తల్లిని నానా మాటలు అన్నాడనీ, అక్కడికి తను ఆయన్ని వారించేందుకు ప్రయత్నించిందనీ, అయినా లాభం లేకపోయిందనీ, కేవలం ఆయన మాటలకి కోపం వచ్చి గోపాలరావు ఆయన్ని కొట్టాడనీ చెప్పింది. వాళ్ళ ఫామిలీ డాక్టరు కూడా అంతక్రితం నుంచే ముసలాయన జబ్బులో ఉన్నట్టు అదే ముదిరి మరణానికి దారి తీసిఉంటుందని అభిప్రాయం వెలిబుచ్చాడు.

ఇకతనకి వ్యక్తిగతంగా ఉన్న పలుకుబడి వినియోగించవలసిన పని పెద్దగా లేకపోయింది ఆనందరావుగారికి.

ఇంటిదగ్గర కూర్చున్నా రన్న మాటే గాని ఆనందరావుగారికి కాలు నిలవడం లేదు. మాటి మాటికీ టైము చూసుకుంటున్నా డాయన. ''ఇంకోఅరగంటలో రావాలిమరి''అనుకున్నారు గడియారాన్ని మరోమారు సంప్రతించి.

"మీరు పదండి. ఏ విషయమయినా హటాత్తుగా చెప్పకూడదు. నేను నిదానంగా చెప్పి మీ దగ్గరకు తీసుకు

వస్తాను'' అంది సుభద్ర విడిపోయే ముందు

"మీరిద్దరూ నన్ను క్షమించి ఇకమీదట నేను చెప్పినట్లు చేయాలి'' నవ్వుతూ అని ఇంటికి వచ్చేశా డాయన.

తను ఇకముందు ఏంచేయాలి? ఇలా హటాత్తుగా "ఈవిడ నా భార్య. వీడు నా కొడుకు" అంటే ఒప్పుకుంటుందా లోకం? మరింకేం చేయాలి? ఎలా ఈ సమస్యను పరిష్కరించడం. తనని ఏమనుకుంటారు?...తనగురించి ఏమను కున్నా తను భయపడడు. ఇతరులకి భయపడడం జీవితంలో ఒకసారే జరుగు తుంది. స్వసుఖాన్ని బలిచేయడం అనేది కూడా అంతే! తనిక వంటరిగాడుకాదు. ఇంటికి వస్తే ఎదురుచూస్తూ ఒక భార్య ఉంటుంది. చేతి కందిన...

తలుపు చప్పుడు ఆలోచనలకి అంతరాయం కలిగించింది. నిజానికి ఆ అంతరాయం మనస్సుకి కష్టం కలిగిం చింది కాకపోగా ఆనందకర మయినది.

గబగబ వెళ్ళి తలుపు తీశా రాయన.

ఎదురుగా గోపాలరావు నిలబడి ఉన్నాడు — ఒంటరిగా!

ఒక్కక్షణం అతనివంక చూసి నిశితంగా తనవంకే చూస్తున్న అతని చూపుకి తట్టుకోలేక తల తిప్పేసుకుంటూ ''రా, రా, లోపల కూర్చుందాం'' అన్నా రాయన కొద్దిగా ఖంగారుపడుతూ.

అతను మాట్లాడకుండా ఆయన్ని అనుసరించి ఆయన వెనకనే వచ్చాడు లోపలికి.

ఆనందరావుగారు వెనక్కితిరిగి అత నింకా తనవంకే తీక్షణంగా చూస్తూం డడం, నిలబడే ఉండడం గమనించి ''కూర్చో. మీ అమ్మ రాలేదూ?'' అనడి గాడు గోడవైపుకి చూపు తిప్పుకుని.

"చెప్పవలసిన దంతా చెప్పింది. అందుకే వచ్చాను'' అన్నాడు గోపాలరావు విసురుగా.

"అయితే—''

''అవును. ఇన్నాళ్ళూ ఏవ్యక్తి నాకు తారసపడకూడ దని భగవంతుణ్ణి ప్రార్థించానో ఆ వ్యక్తి ఎదటే నిలబడి ఉన్నా నని తెలుసు. నేను దేని కయితే భయపడ్డానో అదే చేయ బోతున్నా ననికూడా తెలుసు.''

అతని మాటలోని తీవ్రతకి చిన్న బుచ్చుకున్నాడు ఆనందరావు. "సహజమే నువ్వు అన్నమాటలు! నాలాటివాడిని సాధారణంగా ఎవరూ క్షమించలేరు. నేను మీ యిద్దరిపట్ల తీరని అపచారం చేశాను. అందుకు మనస్ఫూర్తిగా పశ్చా త్తాపపడుతున్నాను."

"కాని లాభంలేదు సర్వనాశనం అయాక 'చేసింది తప్పు' అంటే క్షమిం చేంత సహనం మా అమ్మకి ఉండొచ్చు— ఆవిడ అడదయి పుట్టింది కాబట్టి. కాని మగవాడికి అంతటి విశాల హృదయం, సంస్కారం లేవన్న మాట మీకూ తెలుసు!

"నా జీవితంలో గడిచిపోయినంత వరకు అవమానాలనే ఎదుర్కొన్నాను. డబ్బుకి మా అమ్మ నా కేనాడూ లోపం చేయలేదు. కాని ప్రత్యక్షంగా నా కేనాడూ ఉపకారం చేయకపోయినా మీరు నాకు కావలసినంత అ ప కా ర ం చేశారు... ఏమిటో, నాతండ్రి ఎవరో తెలియనంత మాత్రాన నా కేమీ వ్యక్తిత్వం లేనట్లు ప్రతివాడూ ఆ ప్రశ్నే వే సే వా డు. తెలియని రోజుల్లో వెంటనే అమ్మని ఆ ప్రశ్న అడిగి నేను పడిన బాధని ఆవిడకి బదిలీ చేసేవాడిని. కానీ ఆవిడ పరిస్థితిని అర్థంచేసుకున్న త రు వా త అందరినీ ఎదిరించి నిలబడడం నేర్చుకున్నాను – రాటు దేలిపోయాను. ఇరవయి సంవత్సరాల నా జీవితంలో మీ మూలంగా నేను బాధపడవలసి రావడంవలన మిమ్మల్ని మనస్ఫూర్తిగా ద్వేషిస్తున్నాను. ఎప్పటి కయినా ఇటువంటి సమావేశం తటస్థపడుతుందేమో నని వణికి పోయాను. కా ర ణ ం – ద్వేషం దాచుకోవడం నాకు చేతకానిపని ! నేను న టు డ్ని కా ను – ఆవేశపరుడుని !

"ఇది చాలద న్నట్లు సావిత్రి వాళ్ళ తాతయ్య వ్యవహారం వచ్చింది. సరే కోర్టువారు క్షమించినా నా సావిత్రి నన్ను క్షమించలేదు. 'తన ఆత్మీయుడి మీద చేయిచేసుకున్న వ్యక్తితో కాపరం చేయడం ఆడదాని సహనానికి మించిన పరీక్ష' అంది.

"నేను జీవితంలో ఆరాధించే వ్యక్తులు ఇద్దరు–సావిత్రి, అమ్మ. సావిత్రి అలా శాశ్వతంగా నాకు దూరం అయిపోయింది. ఇక అమ్మకూడా నాకు మిగలబోదు..

"మనదేశంలో ఆడవాళ్ళకి సుకుమార హృదయాలు పెట్టి వాళ్ళని నానా బాధలు పడమని, అలా పడుతూ కూడా 'భర్తే దేముడు' అని ఎలుగెత్తి చాటమని దేముడు శపించాడు. ఇరవయి సంవత్సరాల పాటు తన ఊసయినా పట్టించుకోని వ్యక్తి ఇప్పుడు క్షమించ మనే సరికి అమ్మ ఉబ్బి తబ్బిబ్బయి పోయింది. మీతో జీవించేందుకు సిద్ధంగా ఉంది.

"ఇది నేను సహించలేను. అమ్మ ప్రేమకి ఇన్నేళ్ళుగా నేను ఒక్కడినే వారసుడ్ని. ఇప్పుడు అది పంచి ఇవ్వలేను. నా సావిత్రిని పోగొట్టుకుని, అమ్మని దూరం చేసుకుని నేను బ్రతకలేను. అందుకనే..."

"అందుకనే......" సంశయంతో అడిగారు ఆనందరావుగారు.

"ఈ భూమిమీద మనిద్దరిలో ఒక్కరు మాత్రమే బ్రతకాలి'' ఉద్రేకంతో అని పిస్టల్ బయటికి తీశాడు గోపాలరావు.

చలించిపోయారు ఆనందరావుగారు. ఒక్కక్షణం మౌనంగా ఉండి. "నన్ను క్షమించలేవా ?" అన్నాడు బాధగా.

''ఉహుఁ నా తరం కాదు. మిమ్మల్ని మనస్ఫూర్తిగా ద్వేషిస్తున్నాను.''

"సరే, ఇన్నాళ్లూ మీ అమ్మ, నువ్వు

కలిసి జీవించారు. ఇప్పుడుకూడా అలాగే చేయండి."

''ఆనిర్ణయంతోనే నేనూ వచ్చాను. మా అమ్మ ఇప్పటికే చాలా కష్టాలు అనుభవించి జీవితంలో అలసిపోయింది. నీలాటివాడి చేతిలో ఆమెను వదిలి నేను నిశ్చింతగా చావలేను. అందుకనే ఇప్పుడు నిజంగా హంతకుడి నవదలుచుకుని స్నేహితుడి దగ్గర ఇది అడిగి తెచ్చాను.''

హడావుడిగా సుభద్ర లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చి అక్కడి దృశ్యాన్ని గుమ్మంలోంచే చూసి గ్రహించుకుని స్తంభించిపోయింది—

''గోపీ, ఏమిటది—ఆయన మీ నాన్నగారురా! నిన్నవాళ రక్షించినాయన" అని అరుస్తూ దగ్గరసా వచ్చింది.

"లాభం లేదమ్మా—అంతా అయిపోయింది. ఈయన రాకతో మన సంసారంలో అశాంతి రేగింది" అంటూ పట్టుదలగా పిస్టల్ ఎత్తిపట్టుకున్నాడు.

సుభద్ర కోపంతో వణికిపోయింది. "అయితే నీ మాటే నీదికాని వాస్తవాన్ని గ్రహించ వన్నమాట. ఒక్కటి మట్టుకు గుర్తుంచుకో. ఆడదానికి కొడుకు కన్న భర్తే ఎక్కువ. నువ్విలా ప్రవర్తిస్తావని తెలిసి జాగ్రత్తపడి వచ్చాను" అంటూ చేయెత్తింది — ఆమె చేతిలోని కత్తి తళుక్కున మెరిసింది......

గభాలున ఆనందరావుగారు గోపాలరావుని పక్కకి లాగేసి అతని స్థలంలోకి తను వెళ్ళి 'అబ్బా' అంటూ కుప్పగా కూలిపోయాడు. ఆయన షర్ట్ రక్తంతో తడిసిపోతోంది.

సుభద్ర కెవ్వున కేకేసి ఆయన్ని గట్టిగా పట్టుకుని "నావి పాపిష్టిచేతులు' అంటూ ఏడవసాగింది.

అంతవరకు జరిగినది తెలియక గోపాలరావు గ్రహించుకుని దిగ్భ్రాంతుడయిపోయాడు. క్షణంలో తనని రక్షించిన ఆయనపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది అతని మనసు.

"నాన్నా" అన్నాడు ఖంగారుగా

బీటలు వారిన నేలమీద తొలకరించినట్లయింది ఆనందరావుకి. ఆశగా అతని వంక చూశాడు.

"అవును నాన్నా, నన్ను క్షమించండి. మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను''

"ఛీ దుర్మార్గుడా — ఆయన్ని పొట్టనెట్టుకునేందుకు సిద్ధపడ్డవాడివి నువ్వు. నా కంటికి కనబడకు" అంది ఏడుస్తూనే సుభద్ర కోపంగా.

ఆనందరావుగారు మాత్రం "ఇదుగో సుభద్రా, వాడిని పొమ్మంటే నన్నూ అన్నట్టే — ఎందుకంటే ఇకనుంచి మేమిద్దరం ఒకటే కాబట్టి!" అని నవ్వి "ఖంగారు పడకు, దెబ్బతగిలింది చేతికి మాత్రమే. వెంటనే నయమయిపోతుంది" అన్నాడు.

గోపాలరావు ఆనందంతో గబగబ టెలిఫోన్ దగ్గరకు పరుగెత్తాడు—డాక్టరు కోసం.